# పొరపాటు

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. తెల్లవారితే కనకం పెండ్లి. గోపాలంగారు పెండ్లి పనులతో నలిగి సున్నమైపోతూ గూడా, ఇంకా అల్లుడు పెండ్లికి రాలేదన్న ఆదుర్దాతో బాధపడుతూ, మెయిల్ వద్దకు రామును పంపుదామన్న ఉద్దేశంతో "రామూ రామూ" అంటూ పెద్ద కొడుకును కేకవేశారు. పెండ్లిపనులతో అంతకంటే అలిసిపోయిఉన్న రాము "ఎందుకునాన్నా, పిలిచావు" అంటూ వచ్చాడు.

"చూడూ, మీ బావ మెయిలుకు తప్పకుండా వస్తాడు. ఇదేగా ఆఖరు బండి. తెల్లవారితే పెండ్లి అయెను. ఇంకే బండికి వస్తాడు? తెల్లవారుజామున ఎవరినన్నా తీసుకొని రైలువద్దకుపో," అన్నారు.

"అబ్బా! ఎన్ని బండ్లకుపోను? ప్రొద్దున ప్యాసెంజరుకు వెళ్ళి వచ్చానా, సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌కు వెళ్ళివచ్చానా! ఇప్పుడు ప్యాసెంజరుకు వెళ్ళివస్తున్నా; ఇంకా ఎన్ని బండ్లకు వెళ్ళనుబాబూ! నిన్నటినుండి ఈ బండ్లకు తిరగడమే సరిపోతున్నది," అన్నాడు రాముడు విసుగ్గా, కోపంగా.

"అవును నాయనా! ఇన్ని బండ్లకు తిరిగి, అసలు వచ్చేబండికి వెళ్ళకపోతే ఎట్లా చెప్పు? ఇన్ని బండ్లకు తిరిగింది కనిపించదు. రైలువద్దకన్నా రాలేదన్నమాట నిముషంలో వచ్చేస్తుంది. ఏదో యీ ఒక్క బండికి గూడా వెళ్ళివస్తే మాట దక్కుతుంది. మన వూళ్ళో మెయిల్ యెక్కువసేపు ఆగదుగా. అతనికి ఒక్కడికీ సామాను లవీ దించుకొని దిగడం కష్టం గూడాను," అన్నారు గోపాలంగారు.

"ఏమో మెలకువవస్తే వెళ్ళుతాను."

"మెలకువేమిటి? మనకీ రాత్రి నిద్రలున్నాయేమిటి మేలుకోడానికి. విడిదిలో పెండ్లివారి కన్నీ అమిరినాయో లేదో, ఒకమాటు వెళ్ళివస్తాను. బాబూ! తప్పకుండా రైలువద్దకుపో, మళ్ళీ సందట్లో మఱచిపోతావని చెప్పుతున్నాను," అంటూ గోపాలంగారు విడిదిలో పెండ్లివారి సంగతులు కనుక్కొనేందుకు వెళ్ళారు.

అబ్బబ్బా! బావకోసం రైలుచుట్టూ తిరగలేక యిదైపోతున్నాను, పాపంలే, "పోరా తమ్ముడూ" అంటూ బిక్కముఖం వేసుకొని అక్కయ్యొకతే. ప్రతిబండికీ తరుముతుంది. పోతే ఆయనరాడు', అంటూ సణుక్కున్నాడు రాము. "బావ రాకపోతే అక్కయ్య బిక్కముఖం వేయకపోతే ఇంకా వరేస్తారురా" అన్నది వాళ్ళ మేనత్త కామేశ్వరమ్మ నవ్వుతూ. "అబ్బో, బావకు బలే బెట్టుగా ఉన్నదే. నిన్ననంగా వస్తానని వ్రాశాడు. ఇంతవఱకు రాలేదు. అత్తయ్యగారు, మామయ్యగారు కూడా వచ్చారు. వాళ్ళబ్బాయికంటే వాళ్ళే మంచివాళ్ళన్నది" పెండ్లికూతురు కనకం. "ఉండమ్మా

## కనుపర్తి వరలక్ష్మమ్మ

ఉండు. రేపు మీఆయనేమి బెట్టుచేస్తాడో" అన్నది, వాళ్ళ పింతల్లి కమలమ్మ. "చేసేనా?" అన్నది కనకం. "చేస్తే ఏమి చేస్తా" వేమిటని అందరు పకపకా నవ్వారు. కనకం సిగ్గుతో గదిలో దూరింది.

## 2

తెల్లవారు జామున మూడుగంటలకు వెళ్ళి కనిపెట్టుకొని కూర్చోగా, కూర్చోగా ఐదు గంటలకు బొయ్యమని అఱచుకుంటూ



ఆనందం
—ఫొటో: జె. వి. రత్నావళి, హైదరాబాదు.


వచ్చింది మద్రాసు మెయిల్. రాము కళ్ళు నులుముకుంటూ సెకండుక్లాసు కంపార్టుమెంటువద్దకు పరుగెత్తుకెళ్ళాడు. తనకొరకు ఎవరైనా రైలువద్దకు వచ్చారేమోనని ఎదురు చూస్తూ తలుపుతీసుకొని నిలబడ్డ ప్రసాద్ రామును చూచి "రామూ" అన్నాడు. "ఆఁ వచ్చావూ" అంటూ రాము బావగారివద్దకు వచ్చాడు. లెదర్ బ్యాగ్, హోల్డాల్, పూలబుట్ట వగైరాలు చకచకా రాముకందించి, ఎడమచేతిమీద కోటు వేసుకొని, కుడిచేతితో హాట్ పట్టుకొని దడివడిగా రైలు దిగాడు ప్రసాదరావు. రైలుకూలీ సామాను తెస్తూవుండగా బావమరదు లిద్దరూ టికెట్ కలెక్టరుకు టికెట్ ఇచ్చి బయటికి వచ్చి రిక్షా కుదుర్చుకొని సామానులు పెట్టుకొని రిక్షా ఎక్కారు. "ఏమోయ్ రామం నాకోసం చాలాసేపటినుంచి కనిపెట్టుకొని కూర్చున్నట్టున్నావు. పెళవబండి గంటన్నర లేట్. పాపం నిన్ను చాలా కష్టపెట్టాను" అన్నాడు ప్రసాద్.

"ఇవ్వాలిటి కష్టమేనా! రెండు రోజులనుంచి బండి బండికి వచ్చిన కష్టమో! అబ్బా బండిబండికి త్రిప్పి ఏమి వేధించావయ్యా బావా!" అన్నాడు రాము.

"పెండ్లి యీ ఉదయం తొమ్మిది గంటలకుగా. నేను అయిదు గంటలకే వస్తిని. నేనేమి పొరబాటు చేశానురా" అన్నాడు ప్రసాద్.

"అయితే సరిగా నీవుగూడా పెండ్లికొడుకులాగా ముహూర్తం వేళకే రావాలెనా ఏమిటి? ఒకపూట ముందుగా వస్తేనేం? అటువంటి వాడివి ఒకటి రెండు రోజులు ముందుగా వస్తానని వ్రాయడమెందుకూ? అవచ్చే రైలేదో కచ్చితంగా వ్రాస్తే ఆ రైలుకే వచ్చేవాణ్ణిగా" అన్నాడు రాము, రెండురోజుల నుండీ రైళ్ళచుట్టూ తిరిగిన విసుగుదలా కోపం చూపిస్తూ.

"ఒరే! నీవూ ఉద్యోగంలో ప్రవేశిస్తేగాని ఈ ఉద్యోగపు కష్టాలు తెలియవు. నాకూ ఒకటి రెండు రోజులు ముందుగానే రావాలెనని ఉన్నది కాని ఏం చేస్తాను? ఆఫీసర్ సెలవిస్తేగామా. వాడో పెడసరపు మనిషి. ముఖ్యంగా వెళ్ళా



ఎందుకైనా మంచిది — ఇద్దరు డాక్టర్లుండాలి!

## ★ చదివింపు ★

...లయ్యా! అంటే నీ పెళ్ళైతే వళ్ళుదం ముఖ్యంగాని, మరదలు పెళ్ళేమి ముఖ్యమయ్యా అంటాడు. ఏంజెప్పను ఆమనిషికి? పైగా అవి తీసుకురా ఇవి తీసుకురా అని మీ అక్కయ్య పురమాయింపులాయెను. పట్నంనుంచి వస్తున్న వాడిని గదా కొత్త పూలుగీలైనా కొనుక్కోకుండా ఎట్లారాను? అవీయివీ చూచుకొని వచ్చేటప్పటికి ఆలస్యమైంది. ఏమి చేయమంటావురా" అన్నాడు ప్రసాద్.

"అవును లే, నీ వక్కడ అవీయివీ చూచుకుంటూ మమ్మిక్కడ ఏమీ చూచుకోకుండా పూటపూటా రైళ్లు కాచేందుకు పరుగెత్తించావు. బలేబావవయ్యా! పెండ్లికి వచ్చేవాడికి నీకే అంతతీరుబడిలేనిపనైతే పెండ్లిచేసే వాళ్ళకు మా కెంతపని ఉంటుందంటావు" అన్నాడు రాము చులుగ్గా.

"ఆమహాచేశావు లేవోయ్! పెండ్లి పెత్తనమంతా నీవే చేస్తుంటే మీ నాన్నగారు ఏమి చేస్తున్నట్టు" అన్నాడు ప్రసాదు నవ్వుతూ.

"అవును నీకేమి తెలుస్తుంది? ఎంత మంది విఱగపడి పనిచేస్తే ఆడపిల్ల పెండ్లవుతుంది?" అన్నాడు రాము.

"పాపం చాలా కష్టపడుతున్నావు, పెండ్లి వారిచేత మంచి పంచెలచాపు యిప్పిస్తాపద," అన్నాడు ప్రసాద్.

బావమఱదు లిద్దఱు సల్లాపా లాడుతుండగా నిముషంలో రిక్షా యింటికి వచ్చేసింది. అలుడు వచ్చినందుకు బ్రహ్మానంద భరితులై గోపాలంగారు "వచ్చావా నాయనా" అని ప్రేమపురస్సరంగా అల్లుణ్ని లోనికి తీసుకు వెళ్ళారు. అత్తగారు తక్షణం లోపలికివెళ్ళి కాళ్ళు కడుగుకోటానికి నీళ్లు తెచ్చియిచ్చి "కాళ్ళు కడుక్కోండి" అన్నది. సుందరి అల్లంతదూరాన పెనిమిటిని చూచి చిఱునవ్వుతో తల వంచుకొంది. పెండ్లికూతురు "అబ్బో బావ వస్తున్నాడు, ఎగతాళిచేస్తా" డని గదిలో దూరింది. సెలవు దొరికిందో లేదో ఈరైలుకైనా ప్రసాదరావు వస్తాడో రాడో అని తహతహలాడుతున్న వారందరికి ప్రసాదు ఆగమనం మహా హర్షదాయకమైంది.

ప్రసాద్ మేడమీదకు వెళ్ళుతూఉండగా నౌకరుచేత అతనిపెట్టె హోల్డాల్ పట్టించుకొని సుందరిగూడా మేడమీదకువెళ్ళి భర్తను చూచి "చాలా తొందరగానే వచ్చారే" అన్నది నవ్వుతూ.

"రాకేమి? పెండ్లి అయిపోలేదుగా" అన్నాడు ప్రసాద్.

"సరే యింకా పెండ్లిగూడా అయిపోవాలేకాబోలు"

"ఉద్యోగం చేస్తున్నవాడిని నీవలె పది రోజులు ముందుగా వచ్చి కూర్చోడానికి ఎట్లా వీలవుతుంది. పైగా పూలవీ, బుక్కా అనీ, ప్రెజెంటేషన్లనీ, లక్షపురమాయిస్తివి

దేవివారి ఉత్తరువుప్రకారం అవన్నీ సప్లయి చేసుకొని రావలెగదా."

"సరేకాని కనకానికేమి ప్రెజంటు తెచ్చారు?"

"ఏదో తెచ్చాను."

"నాకు చూపించరూ?"

"చూస్తువుగానిలే అంతతొందరెందుకు?"

"ఏదీ బ్యాగ్ తాళంచెవి యిట్లా యివ్వండి."

"అది ప్యాక్ చేసి ఉన్నది. ఆనక చదివింపులప్పుడు చూడవచ్చునులే."

"ప్యాక్ విప్పితేనేమి? ఆనక ఎట్లాగో విప్పేదేగా. అయినా అంత ప్యాక్ చేసిన దేమిటండీ?" అంటూ తాళపు చెవికోసం కోటుజేబులు వెతుకుతున్నది సుందరి. ఇంతలో "వరపూజకు పోవాలె త్వరగా రా అమ్మా" అని కేక వేసింది సుందరితల్లి. "ప్రసాదరావ్ వరపూజకు పోతున్నాము. నీవుగూడా రా" అని పిలిచారు గోపాలంగారు అల్లుణ్ణి.

"అది ఆనక చూడవచ్చులే. మీ నాన్నగారు, అమ్మగారు, పిలుస్తున్నారు, పోదాం పద" అన్నాడు ప్రసాద్. సతీపతు లిరువురు గబగబా మెట్లుదిగి క్రిందికి వచ్చేశారు. ప్రసాద్ తలిదండ్రులు బిడ్డలకు కన్పించి కుశల ప్రశ్నలుచేసివచ్చి పెండ్లికూతు రెక్కడా కన్పించ దేమంటూ కనకం ఉన్న గదిలోకి వచ్చాడు. కల్యాణం బొట్టుతో, బుగ్గ కాటుక చుక్కతో, కాళ్ళకు పసుపు పారాణితో, పట్టుచీర, పట్టురవిక ధరించి గౌరీపూజకు కూర్చోబోతున్నది. కనకం.

"ఏమిటి విశేషం కనకం? బలే ముస్తాబైనా" వన్నాడు ప్రసాద్. ఎప్పుడూ బావగారిని హాస్యాలాడి విసిగించే కనకం ముద్దరాలై సిగ్గుతో తలవంచుకున్నది, బావగారిని చూచి." అబ్బో అమ్మాయిగారు చాలా సిగ్గు నేర్చుకున్నదే" అన్నాడు ప్రసాద్ నవ్వుతూ. "పెండ్లికూతురు అయిన తర్వాత గూడా యింకా సిగ్గుపడకుండా నీతో కబుర్లు చెప్తూ కూర్చుంటుందయ్యా" అన్నది పెండ్లి కూతురుతల్లో మల్లెపూవులదండ పెట్టుతున్న కనకం మేనత్త. కనకం మరి కొంచెం సిగ్గుతో ముడుచుకుపోయింది.

"ఏం కనకం పెండ్లికొడు కెట్లా ఉన్నా" డన్నాడు మళ్లీ ప్రసాద్ కవ్విస్తూ. కనకం యిక జవాబుచెప్పకుండా ఉండ లేకపోయింది.

"పోయి చూచిరా" అన్నది.

"నేను చూచి వస్తానులే; నీవు చూచినప్పు డెట్లా ఉన్నాడో చెప్పు"

"అట్లా అడిగితే అదేమి చెప్పుతుందిరా. బాగా ఉండబట్టే చేసుకుంటున్నది"అన్నది అప్పుడే అక్కడకువచ్చిన ప్రసాద్ తల్లి.

# 3

ఇంతలో వరపూజకు పదండని గోపాలంగారు వచ్చి స్త్రీ పురుషు లందర్నీ పిలుచుకొని మేళ తాళాలతో బయలుదేరి వెళ్లారు. పెండ్లికొమార్తెను గౌరీ పూజకు కూర్చోబెట్టి పురోహితుడు గూడా వరపూజ జరిపించుటకువెళ్లాడు. వరపూజ అయింది. పెళ్ళికొమారుని కారుమీద తోడ్కొని వచ్చారు. పెండ్లికొమారుడిచేత మంగళ స్నానాలు చేయించి పట్టువస్త్రములు కట్టించి పందిరిలో వివాహతంతు ఆరంభించాడు- శాస్త్రులుగారు - ఆడపెండ్లివారు మగపెండ్లివారు స్త్రీ పురుషులు యావన్మంది చక్కగా ముస్తాబై పెండ్లి పందిరినిండా కూర్చున్నారు. మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. వెంట వెంటనే కన్యాదానం సూత్రధారణం తలంబ్రాలు అయిపోయినాయి. "అయ్యా! కన్యాదాతలకు కట్నాలు తీసుకరండి అమ్మా వధూవరులకు చదివింపులు చదివించేవాళ్ళు చదివించవచ్చును" అన్నాడు శాస్త్రులుగారు. కన్యాదాతలకు కట్నాలు చదివించడమైన తరువాత వధూవరులకు చదివింపు లారంభమైనాయి. బంధువులు, మిత్రులు పరిచయస్తులు ఉభయపక్షాల వారు వారికి ఇష్టమైనవిధంగా వస్త్రాలు, రజతపాత్రలు, గ్రంథాలు, కలాలు, పెన్సిళ్లు టాయిలెట్ సామానులు జోరుగా చదివించడం ప్రారంభించారు. కనకానికిఏదో బహుమానం తెచ్చానన్న ప్రసాద్ చదివింపుల వేళకు ఎక్కడా కన్పించకపోతే సుందరి పెనిమిటికొరకు పందిరంతా వెదికి అక్కడ కనిపించకపోతే మేడమీదకు వెళ్ళింది. ప్రసాద్ అక్కడ నిదానంగా పడుకొని ఉన్నాడు.

"ఇదేమిటండీ, ఇక్కడ పడుకున్నారు? కనకానికి ఏమిటో ప్రెజెంటేషన్ తెచ్చానంటిరే! చదివించరూ?" అన్నది.

"నీవు తీసుకపోయి చదివించూ."

"అదేమిటి నేను చదివించడమేమిటి? మీరు వచ్చి చదివించరాదూ?" అన్నది సుందరి.

"వస్తున్నాలే పద" అదిగో ఆ బ్యాగులో ఉన్నది. తీసుకొనివెళ్ళు" అన్నాడు. తాళపుచెవి చేతిలోపెడ్తూ. సుందరి గబగబా తాళము తీసి దానిలోవున్న బంగిని తీసి "యిదేనా" అన్నది. "అవును, తీసుకపద" అన్నాడు. సుందరి వడివడిగా మేడదిగి బంగీ తీసుకవచ్చి శాస్త్రులుగారి చేతిలోపెట్టి ఇది పెండ్లికుమార్తెకు చదివించండన్నది." ఇదేమిటని చదివించను బంగీఅని చదివించవచ్చునా? ఎవరిపేర చదివించను" అన్నాడు శాస్త్రులుగారు.

"ఎవరిపేర నేమిటండి మా వాడు తెచ్చి పెట్టున్నాడు. వాడిపేర చదివించం"డన్నది ప్రసాదరావు తల్లి.

"అబ్బాయిగారిపేరు ప్రసాదరావుగారు గాదుటండీ?"

"అదేమిటండోయ్! అప్పుడేమరచిపోయినారు? మాఅబ్బాయిని ఇంట్లో ప్రసాద్, ప్రసాద్ అంటాముగాని వాడి పూర్తిపేరు వేంకట సూర్యలక్ష్మీనరసింహ శివరామకృష్ణ సుధాకరప్రసాదరావుగారు. మా యింటిపేరు హరిరాజువారు అన్నది ఆమె. ఊహూ!మా! బావగారు హరిరాజు వేంకట సూర్యలక్ష్మీ నరసింహశివరామకృష్ణ సుధాకర ప్రసాదరావుగారు మీ వివాహమహోత్సవకాలమందు మరదలిని ఆశీర్వదించి యిచ్చిన బంగీ" అని శాస్త్రులుగారు అంటూ ఉండగానే పెండ్లికుమార్తె తల్లి "అదేమిటండీ శాస్త్రులుగారూ అంతతొందర? బంగీలో వున్న వస్తువేదో తీసి చదివించాలె గాని బంగీ అని చదివించడమేమిటండీ" అన్నది. ఇంతలో ప్రసాదరావు వచ్చి నవ్వుతూ నిలుచున్నాడు. "దానిలో ఏమున్నదిరా అన్నది "తల్లి శాస్త్రులనుగారినే చూడమను" అన్నాడు ప్రసాదరావు.

"అయ్యా ఆవస్తు వేమిటో పైకి తీసిఇస్తే చదివిస్తాముగాని ఈ బంగీలన్నీ ఎక్కడ విప్పమండీ" అంటూ శాస్త్రులుగారు "అమ్మా ఎవరివద్దనైనా కొస్త చాకు ఉంటే అందుకోండి" అన్నాడు. రాము చాకు తెచ్చి యిచ్చాడు. గుడ్డతోకుట్టి సీలుచేసిన బంగీని చాకుతో కోశాడు శాస్త్రులుగారు. అంతటితో దానిలోవస్తువు బయట పడలేదు. దానిచుట్టు ఎన్నో కాగితాలు టేపుతో గట్టిగా చుట్టి ఉన్నాయి. క్షణంలో అందరి దృష్టులు ప్రసాదరావు మరదలికి తెచ్చిన బహూకరణ పైనిలిచిపోయినాయి. ఆబంగీని చుట్టిన కాగితాలకు అంతులేదు. అక్షయవస్త్రాల్లాగా 'క్రిస్టువా చీ' అంటున్నారు. ఒకరు చెమటలు పోస్తూ శాస్త్రులుగారు విప్పదీస్తున్నారు.

అందరు ఒకరిమీద ఒకరు నిలిచి విరగబడి చూస్తున్నారు. అందులో ఏమున్నది? ఒకరు 'ఉంగర' మంటున్నారు. ఒకరు 'పచ్చనోటు' అంటున్నారు. "మరదలి బహుమానం కాదు గాని మమ్మలను గూడా హైరాను పెట్టుతున్నా వేమయ్యాపంతులు" అంటున్నాడు శాస్త్రులు. అదిగో, అదిగో వచ్చింది. చేతి రుమాలుతో కట్టి ఉన్నది. ఏమిటి ఏమిటి, చిన్న బొమ్మ పాతగుడ్డపేలికనయా పైనా, "హా! హా!" అందరు విరగబడి నవ్వుతూ, "ఏడీ ఆబావగారు?" అంటూ నలుదెసలా పరికించి చూచారు. బావగారు పత్తా లేదు. ★